సాక్షి
శ్రీకాకుళం
మంగళవారం । 22 । అక్టోబర్ । 2024



విన్నపాలు వినవలె

జిల్లా కేంద్రంలో నిర్వహించిన మీకోసంకు 138 వినతులు వచ్చాయి. జేసీ వినతులు స్వీకరించారు. - 8లో



కేజీబీవీ విద్యార్థినులు అదృశ్యం

జి.సిగడాంలో ఇద్దరు కేజీబీవీ విద్యార్థినులు అదృశ్యమయ్యారు. వీరు ఇంటర్ చదువుతున్నారు. - 8లో

జవహర్ నవోదయలో ప్రవేశాలకు దరఖాస్తులు

సరుబుజ్జిలి: వెన్నెలవలస జవహర్ నవోదయ విద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను 9, 11 తరగతుల్లో ప్రవేశానికి సంబంధించి ఈ నెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని విద్యాలయం ప్రిన్సిపాల్ డి.వ రఘురామయ్య సోమవారం ప్రకటనలో వెల్లడించారు. దరఖాస్తులు నవోదయ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లోనే చేయాలని సూచించారు.

న్యూస్‌రీల్

పోర్టు పూర్తి చేసి ప్రజలకు అంకితం చేస్తాం



మూలపేట పోర్టు పనులను పునః ప్రారంభిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

సంతబొమ్మాళి: మూలపేట పోర్టును త్వరగా పూర్తి చేసి ప్రజలకు అంకితం చేస్తామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మూలపేట పోర్టు పనులను మంత్రి అచ్చెన్నాయుడు సోమవారం పునః ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 194 కిలోమీటర్ల తీర ప్రాంతం ఉన్న ఈ రాష్ట్రంలో ప్రతి 60 కిలోమీటర్లకు ఒక షిప్పింగ్ హార్బర్ గానీ ఫిషింగ్ ల్యాండ్‌గానీ ఏర్పాటు చేసే దిశగా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. 2025 జూన్ 12 కల్లా మొదటి బెర్త్ పూర్తి చేసి మొదటి షిప్ ల్యాండ్ చేసే దిశగా పనిచేయాలని సూచించారు. భోగాపురం ఎయిర్‌పోర్టు, మూలపేట పోర్ట్‌కు అనుసంధానం చేస్తూ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశామని అన్నారు. భోగాపురం నుంచి మూలపేట పోర్టు వరకు ఆరులైన్ల రోడ్డు నిర్మాణం చేపడుతున్నామని అన్నారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వంపై విమర్శలు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం అమలు చేసిన లిక్కర్ పాలసీ ద్వారా ప్రభుత్వానికి రూ.1900 కోట్లు ఆదాయం వచ్చిందని, అలాగే మద్యం అమ్మకాల్లో ఆరు రోజుల్లో రూ.600 కోట్లు వచ్చిందని చెప్పారు. ట్రాక్టర్లు, బండ్ల ద్వారా నది దగ్గరకు వెళ్లి ఇసుక తీసుకోవచ్చని, దీనిపై అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. అంతకుముందు పోర్టు పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఆయనతో పాటు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, పోర్టు అధికారులు పాల్గొన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

కాశీబుగ్గ: పలాసలో ఇద్దరు బాలికలపై అత్యాచారం చేసిన సంఘటనలో ముగ్గురిపై కాశీబుగ్గ సీఐ మోహనరావు సోమవారం కేసు నమోదు చేశారు. బాధితురాలి తల్లి కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. బాధితురాలి తల్లి మాట్లాడుతూ.. తన భర్త చనిపోయాడని, టీ దుకాణం పెట్టుకుని బతుకుతున్నామని తెలిపారు. శనివారం ఓ 19 ఏళ్ల యువకుడు వచ్చి తన చిన్న కుమార్తెను పుట్టిన రోజు వేడుకలకు పిలిచాడని, తాను నిరాకరించడంతో తాను లేని సమయంలో వచ్చి ఇద్దరు కూతుళ్లను ఇంటి వద్ద నుంచి కారులో తీసుకుని వెళ్లాడని చెప్పారు. మద్యం కలిపిన కూల్‌డ్రింక్స్ ఇచ్చి అత్యాచారానికి పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వారిద్దరికీ స్పృహ లేని పరిస్థితుల్లో ఇంటి వద్ద దించేసి వెళ్లిపోయారని తెలిపారు. నిందితులకు కఠిన శిక్ష పడాలని కోరారు.

వలంటీర్ల ఆందోళన



పలాస ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నాలో వలంటీర్లు

కాశీబుగ్గ: వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించి న్యాయం చేయాలని కోరుతూ పలాస ఆర్డీఓ కార్యాలయం వద్ద వలంటీర్లు సోమవారం ఆందోళన నిర్వహించారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మొజ్జాడ యుగంధర్ మాట్లాడుతూ తమకు బకాయి పడిన నాలుగు నెలల గౌరవ వేతనాన్ని మంజూరు చేయించాలని కోరారు. రాజీనామా చేసిన వలంటీర్లను బలవంతపు రాజీనామాలుగా గుర్తించి తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ధర్నా అనంతరం ఏఓ ప్రకాశరావుకి డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందించారు. కూటమి పార్టీలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు.

సలామ్ పోలీస్

- పోలీసు అమరవీరుల త్యాగం అజరామరం

శ్రీకాకుళం క్రైమ్ :

పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అధ్యక్షతన సోమవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. మంత్రి అచ్చెన్నాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా మంత్రి అచ్చెన్న, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వరరెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, శాసన సభ్యులు గొండు శంకర్, ఎన్‌ఈశ్వరరావులు పోలీసు అమరవీరుల స్థూపం వద్ద పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా పోలీసు ఆయుధాలను ప్రదర్శించే ఓపెన్ హౌస్‌ను మంత్రి ప్రారంభించి కాసేపు తిలకించారు. అమర పోలీసుల కుటుంబ సభ్యులను సత్కరించారు. 2024లో విధి నిర్వహణలో చనిపోయిన ఉమామహేశ్వరరావు, సతీష్, మాధవరావు, లక్ష్మణరావు కుటుంబాలకు ఆర్థిక సాయాన్ని అందజేశారు.



అమరవీరుల స్థూపం వద్ద మంత్రి అచ్చెన్నాయుడి నివాళి



పోలీసుల గౌరవ వందనం

ఫ్రెండ్లీ పోలీసింగ్ కావాలి

జిల్లాను గంజాయి, మాదక ద్రవ్య రహిత జిల్లాగా మార్చాలి. మహిళలపై దాడులు, అత్యాచారాలు, పిల్లల అదృశ్యాలు జరుగుతున్నాయి. వాటిని అరికట్టాలి. సాంకేతికత సాయంతో విజిబుల్ పోలీసింగ్ చేయాలి. ప్రతి పౌరుడితో ఫ్రెండ్లీ పోలీసింగ్ అనిపించుకోవాలి. పోలీసు సంక్షేమానికి ప్రభుత్వం సహకరిస్తుంది. సకాలంలో జీతాలు, ఇంక్రిమెంట్లు అందేలా చూస్తాం. పోలీసు పిల్లలకు మెరిట్ స్కాలర్‌షిప్ అందేలా చూస్తాం. హోంగార్డులను కూడా ఆదుకుంటాం. - కె.అచ్చెన్నాయుడు, మంత్రి



అన్ని విధాలుగా ఆదుకుంటున్నాం..

ప్రజల అభ్యున్నతికి పాటుపడేవాడే పోలీస్. జిల్లాలో అమరులైన ఎస్.బంగారునాయుడు, ఎ.పాపారావు, ఎం.నరేంద్రదాస్, ఎం.వెంకటరమణ, పి.కృష్ణమూర్తిలకు అందరం నివాళులర్పిద్దాం. ఇటీవల ఐదుగురికి కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు కల్పించాం. పోలీసుల కోసం కొన్ని బ్యాంకులతో లింక్ ద్వారా శాలరీ ప్యాకేజీ బేస్డ్ ఇన్సూరెన్సు సదుపాయం కల్పిస్తున్నాం. - కేవీ మహేశ్వర రెడ్డి, ఎస్పీ




అండగా ఉంటాం..

నిరంతరం పోరాటం చేసే పోలీసుల సేవలు అభినందనీయం. దేశం కోసం, రాష్ట్రం కోసం, ప్రజల కోసం ప్రాణాలర్పించి అమరులైన పోలీసులకు అందరం నివాళులర్పించాలి. ప్రభుత్వ యంత్రాంగం తరఫున ఎలాంటి సహాయం కావాలన్నా అండగా ఉంటాం. - స్వప్నిల్ దినకర్ పుండ్కర్, కలెక్టర్

ఇదెక్కడి విష సంస్కృతి..?





పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ ఉలిక్కిపడింది. పుట్టిన రోజు వేడుకలకు వెళ్లిన ఇద్దరు ఆడపిల్లలపై లైంగికదాడి జరిగిందనే విషయం వెలుగు చూడడంతో జంట పట్టణాల్లో కలకలం రేగింది. ఈ కేసులో నిందితులు కూడా మైనర్లే కావడం గమనార్హం. కాశీబుగ్గకు చెందిన పదహారేళ్ల వయసు నిండిన ముగ్గురు బాలికలను అదే వయసు కలిగిన ముగ్గురు బాలురు పుట్టినరోజు వేడుకలకు పిలిచి వారిలో ఇద్దరిపై లైంగికదాడికి పాల్పడ్డారు. మద్యం మత్తులో ఈ ఘటన జరిగినట్లు సమాచారం. కౌమార దశలోనే మద్యపానం అలవాటు చేసుకోవడం, మైనర్లు అని తెలిసినా వారికి మద్యం విక్రయించడం వంటి లోపాలు ఈ అకృత్యంతో బయటపడ్డాయి. స్థానికులు తెలిపిన వివరాల్లోకి వెళితే..

- పలాసలో ఇద్దరు బాలికలపై అత్యాచారం
- నిందితులూ మైనర్లే
- పుట్టిన రోజు వేడుకలకు తీసుకెళ్లి అఘాయిత్యం
- కాశీబుగ్గ పోలీసుల అదుపులో నిందితులు



కాశీబుగ్గ:

మున్సిపాలిటీకి చెందిన ముగ్గురు బాలురిలో ఒకరి పుట్టిన రోజు కావడంతో ఈ నెల 19న వారు ముగ్గురు బాలికలతో బయటకు వెళ్లారు. ఈ ముగ్గురు బాలికల్లో ఇద్దరు అక్కాచెల్లెళ్లు ఉన్నారు. 19న రాత్రి ఈ ఆరుగురు కలిసి పలాస సినిమా థియేటర్ సమీపంలో బిర్యానీలు, కేక్‌లు, గిఫ్టులు, మద్యం పట్టుకుని బైక్‌లపై జంట పట్టణాలను దాటి వెళ్లారు. పట్టణానికి దూరంగామనుషుల అలికిడి లేని ప్రాంతానికి చేరుకుని పుట్టిన రోజు వేడుక చేసుకున్నారు. కేక్ కటింగ్ చేసి మద్యం సేవించినట్లు సమాచారం. ఆ సమయంలో అక్కాచెల్లెళ్లపై ఇద్దరు బాలురు లైంగికదాడికి పాల్పడ్డారు. మరో బాలికతోనూ చనువుగా ప్రవర్తించడానికి ప్రయత్నించగా ఆమె ప్రతిఘటించింది. లైంగికదాడిని వీడియో రికార్డు చేసుకున్నారు. అదే రోజు రాత్రి పదకొండు గంటల సమయంలో అందరూ ఇళ్లకు చేరుకున్నారు. ఆదివారం ఉదయం మూడో బాలిక తన తల్లిదండ్రుల వద్ద ఈ వ్యవహారాన్ని బయటపెట్టింది. మిగతా ఇద్దరు బాలికల తల్లిదండ్రులకు కూడా విషయం తెలియడంతో వారు పరువు పోతుందని మిన్నకుండిపోయారు. అక్కాచెల్లెళ్లలో ఒక అమ్మాయి అనారోగ్యానికి గురి కావడం, సోమవారానికి కూడా స్పృహలోకి రాకపోవడంతో వారు పోలీసులను ఆశ్రయించారు. సీఐ మోహనరావు ఫిర్యాదును తీసుకుని కేసును ఎస్పీ మహేశ్వరరెడ్డి, ఏఎస్పీ/కాశీబుగ్గ డీఎస్పీ శ్రీనివాసరావుల దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారు. అయితే నిందితుల్లో ఒకరు మేజర్ ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ ఉదంతాన్ని రాజీ చేసేందుకు కూడా ప్రయత్నాలు జరిగినట్లు సమాచారం. బాధితుల ఇళ్ల వద్దకు చైల్డ్‌లైన్ వారు సైతం వెళ్లి వాకబు చేస్తున్నారు.

నిందితుల్ని గుర్తించారు : ఎమ్మెల్యే



పలాసలో నాటుకుపోయిన గంజాయి సంస్కృతే ఈ అకృత్యాలకు కారణమని, దాన్ని కూకటి వేళ్లతో పెకిలించడానికి సమయం పడుతుందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌కు ఫిర్యాదు చేయడానికి వచ్చిన ఆమె మాట్లాడారు. బాధితుల తల్లిని కలిశామని, పుట్టిన రోజు వేడుకల నుంచి ఆదివారం వచ్చిన చిన్నపాప సోమవారానికి కూడా ఇంకా స్పృహలోకి రాలేదని చెప్పారని తెలిపారు. ఈ విషయంలో రాజకీయం చేయకూడదని, ఎలాంటి సెటిల్‌మెంట్లు చేయకూడదని అన్నారు. నిందితులను గుర్తించారని, కులం, పార్టీ, స్థాయి చూడకుండా శిక్షించాలని కోరారు.

బాలికలపై అఘాయిత్యం బాధాకరం

- ఎమ్మెల్యే ఇలాకాలో జరగడం సిగ్గుచేటు
- మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు



కాశీబుగ్గ: పలాసలో శనివారం రాత్రి బాలికలపై అఘాయిత్యం జరగడం బాధాకరమని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఇలాంటి ఘటనకు పాల్పడిన వారిపై ప్రభుత్వం తక్షణమే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఒక మహిళా ఎమ్మెల్యే ఇలాకాలో ఇంతటి ఘోరం జరగడం సిగ్గుచేటని అన్నారు. రాష్ట్రంలో టీడీపీ అధికారం చేపట్టిన నాటి నుంచి ఆడపిల్లలపై అత్యాచారాలు పెరిగిపోయాయని సామాజిక మాధ్యమాల్లోనూ చర్చ జరుగుతోందన్నారు. పలాసలో జరిగిన అత్యాచారం విషయంలో అధికార పార్టీ నాయకులు వెంటనే రంగప్రవేశం చేసి వాస్తవాలను దాచిపెట్టే ప్రయత్నం చేశారని ఆరోపించారు. అంతే కాదు బాధితులను అదిరించి బెదిరించి వివాదాన్ని సద్దుమణిగేలా చేయాలని చూశారని చెప్పారు. బాధితుల పరిస్థితులు తెలుసుకుని పెద్ద మొత్తంలో డబ్బులు గుంజుకున్నట్లు ప్రచారం జరుగుతోందని, బాధితులు ఇచ్చిన ఫిర్యాదు పేపర్లు సైతం చించేసి వీడియోలు మొబైల్ నుంచి తొలగించి నిందితులను కాపాడుతూ వచ్చారనే ఆరోపణలు పలాస అంతటా వినిపిస్తున్నాయని పేర్కొన్నారు. నాయకులు ప్రజల బాధలను తీర్చకుండా ఒప్పందాలు కుదుర్చుకుని రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. పాలకవర్గం, అధికార యంత్రాంగం బాధితులకు న్యాయం చేయకపోగా వారి వీడియోలు మాయం చేయడం, రాజీ కుదర్చడానికి డబ్బులు చేతులు మార్చారనే ఆరోపణలపై స్పందించాలన్నారు. బాధితులకు న్యాయం చేయాలని ప్రకటనలో ఆయన కోరారు.

అత్యాచారానికి పాల్పడిన వారిని శిక్షించాలి



బడకల ఈశ్వరమ్మ

పలాస: పలాసకు చెందిన బాలికలపై అత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు బడకల ఈశ్వరమ్మ డిమాండ్ చేశారు. రోజు రోజుకూ మహిళలపై అత్యాచారాలు పెరుగుతున్నాయని ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

గాలిలో దీపంలా ఆడపిల్లల ప్రాణాలు



ఇచ్ఛాపురం రూరల్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో మహిళలపై అత్యాచారాలు, హత్యలు ప్రమాదకర స్థాయికి చేరుకున్నాయని, ఆడపిల్లల ప్రాణాలు గాలిలో దీపంలా ఉన్నాయని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రజలకు రక్షణ కవచంగా ఉండే సీఐ తల్లికి కూడా కూటమి ప్రభుత్వంలో రక్షణ లేకుండా పోయిందని, వరుసగా అత్యాచార ఘటనలు, దారుణ హత్యలు జరుగుతున్నా అటు సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గానీ ఇటు రాష్ట్ర హోం శాఖ మంత్రి అనిత గానీ స్పందించకపోవడం దారుణమని పేర్కొన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మహిళలు, బాలికల రక్షణ కోసం దిశ యాప్ రూపొందించడమే కాకుండా, ప్రత్యేకంగా 12 దిశ పోలీస్ స్టేషన్లు, 12 మహిళా కోర్టులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లను ఏర్పాటు చేశామని గుర్తు చేశారు.

ఉల్లంఘనులు



ఇక్కడ పట్టపగలు ఇసుకను యంత్రాలతో తవ్వేసి నదిని గుల్ల చేసేస్తున్నారు.

ఈ ఫొటో చూడండి. వంశధార నదిలో జేసీబీ, ప్రొక్లైనర్, తదితర యంత్రాలతో ఇష్టారీతిన ఇసుకను తవ్వేస్తున్న దృశ్యమిది. గార ఇసుక డీసిల్టేషన్ స్టాక్ యార్డ్ ముసుగులో వర్క్ దక్కించుకున్న అమరావతికి చెందిన భవానీ ట్రావెల్స్ పేరుతో తెలుగు తమ్ముళ్లు చేస్తున్న అక్రమ దందా ఇది. సుప్రీంకోర్టు, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు నదిలో యంత్రాలతో ఎలాంటి తవ్వకాలు జరపకూడదు. కానీ



ఈ ఫొటో చూడండి. గార డీసిల్టేషన్ స్టాక్ యార్డ్ పాయింట్ కోసం ఏకంగా నదిలో బాట వేసిన దృశ్యమిది. సుప్రీంకోర్టు, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ మార్గదర్శకాల ప్రకారం నదిలో బాటలు వేసి ధ్వంసం చేయకూడదు. ఇక్కడ అందుకు భిన్నంగా జరుగుతోంది.

- సుప్రీంకోర్టు, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలు బేఖాతరు
- అత్యున్నత వ్యవస్థల మార్గదర్శకాలను పట్టించుకోని అమరావతి ఏజెన్సీ
- నదిలో యంత్రాలతో తవ్వకాలు
- నదీ గమనాన్ని ధ్వంసం చేస్తూ బాటలు ఏర్పాటు



గార డీసిల్టేషన్ పాయింట్‌కు లారీల జాతర

సాక్షిప్రతినిధి, శ్రీకాకుళం: ఇసుకాసురులు జిల్లాలో నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారు. సుప్రీంకోర్టు, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలను తాము అమలు చేయాల్సిన అవసరం లేదని, వాటి మార్గదర్శకాలను పాటించనవసరం లేదన్నట్టుగా అమరావతికి చెందిన కాంట్రాక్ట్ ఏజెన్సీ వంశధార నదిని గుల్ల చేసేస్తోంది. పైన చెప్పినవే కాదు ఇక్కడ మరికొన్ని అక్రమాలు జరుగుతున్నాయి. వాస్తవంగా జిల్లా కమిటీ నిర్దేశించిన వ్యక్తుల సమక్షంలోనే ఇసుక తవ్వకాలు జరపాలి. తవ్విన పరిమాణం ఎంతో ఎప్పటికప్పుడు కొలత లేసి లెక్కించాలి. ఎంత పరిమాణంలో విక్రయించారో రికార్డు చేయాలి. కానీ, ఇక్కడ అలాంటివేవీ జరగడం లేదు. జిల్లా కమిటీ సూచించిన వ్యక్తులు ఏం చేస్తున్నారో. ఎక్కడుంటున్నారో తెలియడం లేదు. డీసిల్టేషన్ కాంట్రాక్ట్ దక్కించుకున్న భవానీ ట్రావెల్స్ ఏజెన్సీ పేరుతో కొందరు 'తెలుగు తమ్ముళ్లే' అంతా తామై వ్యవహరిస్తున్నారు. నచ్చినట్టుగా వసూలు చేసి, తోచిన రశీదులిచ్చి ఇసుక దందాను యథేచ్ఛగా కానిచ్చేస్తున్నారు. ఇక్కడ రోజుకి అడ్డగోలు బిజినెస్ రూ.లక్షల్లోనే ఉంది. ఎంత ఇసుక ఇక్కడి నుంచి తరలిపోతుందో లెక్కాపత్రం లేదు. ఉచిత ఇసుక, డీసిల్టేషన్ ముసుగులో అడ్డగోలుగా దోపిడీ జరుగుతోంది. ఇంత జరుగుతున్నా అధికార వర్గాలు ఏం మాట్లాడటం లేదు. బాటలు వేయడానికి లేదు, యంత్రాలతో తవ్వడానికి లేదని బయట చెప్పడం తప్ప జరుగుతున్న తంతును ఆపడం లేదు. దీనికంతటికీ ఉన్నత స్థాయి నుంచి వస్తున్న ఒత్తిళ్లే కారణమని తెలుస్తోంది.

ఇటీవల ఒక సమావేశంలో కూడా 'తెలుగు తమ్ముళ్లు' చెప్పినట్టు చేయాలని క్షేత్రస్థాయి సిబ్బందికి మౌఖిక ఆదేశాలిచ్చినట్టు ఉద్యోగ వర్గాలు చెబుతున్నాయి. ఇదిలా ఉండగా, ఇసుక డిమాండ్ నేపథ్యంలో అడ్డగోలు తవ్వకాల చోటుకి లారీలు క్యూ కడుతున్నాయి. డీసిల్టేషన్ పాయింట్‌కు వెళ్లే దారిలో జాతరలా బారులు తీరుతున్నాయి.

ట్రాక్టర్లకు నో ఎంట్రీ..

నదుల నుంచి ట్రాక్టర్ల ద్వారా నేరుగా ఇసుక తరలించుకోవచ్చని ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక వైపు చెబుతున్నారు. కానీ, ఇక్కడ అవేవీ కుదరవని అమరావతి ఏజెన్సీ నిర్మోహమాటంగా చెప్పేస్తోంది. సీఎం ఆదేశాలు తమకు వర్తించవని ఇసుక కోసం వచ్చిన ట్రాక్టర్లను అడ్డుకుంటున్నారు. సోమవారం ట్రాక్టర్ల యజమానులు ఆందోళన కూడా చేశారు. ట్రాక్టర్లను ఎందుకు అనుమతించరని నిరసన వ్యక్తం చేశారు.

ఈ ఫొటో చూడండి. డీసిల్టేషన్ తవ్వకాలు జరిగిన చోటుకి నేరుగా లారీని అనుమతించిన దృశ్యమిది. నిబంధనల ప్రకారమైతే తవ్వకాలు జరిగిన చోటుకి భారీ వాహనాలు అనుమతించరు. మాన్యువల్‌గా తీసిన ఇసుకను ట్రాక్టర్ల ద్వారా స్టాక్ పాయింట్‌కు రవాణా చేసి, అక్కడి నుంచి భారీ వాహనాలకు లోడింగ్ చేయాలి. ఇక్కడంతా విరుద్ధంగా జరుగుతోంది.



కొలువుల భర్తీలో గందరగోళం

- సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగాల భర్తీలో గందరగోళం
- పాత నిబంధనలకు తిలోదకాలు
- తాజా నోటిఫికేషన్‌లో కూడా చివర దాకా మార్పులు



శ్రీకాకుళం: జిల్లాలోని సమగ్ర శిక్షా అభియాన్‌లో బోధన, బోధనేతర ఉద్యోగాల భర్తీలో గందరగోళం నెలకొంది. గత నెల 22వ తేదీన ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశారు. ఇందులో బోధన, బోధనేతర సిబ్బందికి సంబంధించి రోస్టర్ ప్రకారం ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పారు. దీని ప్రకారం దరఖాస్తు చేసుకునేందుకు అభ్యర్థులు ముందుకు వచ్చారు. కానీ వీరికి ఎన్నో అడ్డంకులు ఎదురయ్యాయి. దరఖాస్తు చేసుకునేందుకు, మెరిట్ జాబితా తయారు చేసేందుకు వినియోగించే సాఫ్ట్‌వేర్‌లో అనేక లోపాలు ఉండడంతో ఇబ్బందులు తప్పలేదు. ఈ సాఫ్ట్‌వేర్‌లో అభ్యర్థుల మార్కుల ప్రకారం మెరిట్ జాబితా తయారు కావాలి. మార్కులు అప్‌గ్రేడ్ కాకపోవటం వల్ల జాబితా అస్తవ్యస్తంగా తయారైంది. అలాగే జిల్లాలో ఖాళీగా ఉన్న పలు పోస్టులు నోటిఫికేషన్‌లో కనిపించలేదు. దీనిపై అభ్యర్థులు మొదటి నుంచి ఆందోళన చెందుతూనే ఉన్నారు. మెరిట్ జాబితా తర్వాత ఎంపికైన బోధన అభ్యర్థులకు డెమో నిర్వహించాలి. దీన్ని తాజా నోటిఫికేషన్‌లో తొలగించారు. ఇప్పటికే గెస్టు ఫ్యాకల్టీగా పనిచేస్తున్న వారికి అనుభవం ప్రకారం, బోధన సాగిస్తున్న వారిలో వయసు ఎక్కువగా ఉంటే వారి సీనియార్టీకి అదనపు మార్కులు కల్పించాల్సి ఉండగా దీనికి తిలోదకాలు ఇచ్చారు. అలాగే రోస్టర్ చివరి క్షణంలో మార్చడం వల్ల దరఖాస్తుదారుల్లో 70శాతం మంది ఇంటర్వ్యూలకు హాజరు కాలేకపోయారు. నోటిఫికేషన్‌లో ఇచ్చిన రోస్టర్ తప్పని, గత ప్రభుత్వ హయాంలో ఏ రోస్టర్ పాయింట్ వరకు భర్తీ చేశారో తర్వాత రోస్టర్ పాయింట్ నుంచి భర్తీ ప్రారంభించాలని ఓ అభ్యర్థి ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయించారు. కమిషన్ ఆదేశాల మేరకు మెరిట్ జాబితా ప్రకటించిన తర్వాత రోస్టర్ పాయింట్లను మార్చేశారు. దీని వల్ల గందరగోళం చోటు చేసుకుంది. ఐదు రోజుల క్రితం మెరిట్ జాబితాను ప్రకటించి అభ్యంతరాలు తెలియజేయాలని ఒక రోజు గడువు ఇచ్చారు. కానీ అభ్యంతరాలు పట్టించుకున్న పాపాన పోలేదు. రోస్టర్ పాయింట్లు మారిపోవటం వల్ల దరఖాస్తుదారుల్లో 700 మంది వరకు ఫీజు చెల్లించాక అనర్హులయ్యారు.

వంతెన సమీపంలోనే ఇసుక తవ్వకాలు



మడపాం వంతెన వద్ద బైరి వైపు ఇసుక లోడ్ చేస్తున్న ట్రాక్టర్లు

నరసన్నపేట: ఇసుక ఉచితంగా తీసుకువెళ్లేందుకు ట్రాక్టర్లకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో నిబంధనలు బేఖాతరు చేస్తూ తవ్వకాలు చేస్తున్నారు. మడపాం, బుచ్చిపేట, చేనులవలస, లుకలాం, ఉప్పరిపేటల్లో ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. అలాగే మడపాం వంశధార నదిపై నిర్మించిన వంతెన సమీపంలోనే ఇసుక తవ్వి తీసుకెళ్తున్నారు. వంతెనకు వంద మీటర్లలోపు ఇసుక తవ్వకాలు చేయకూడదు. కానీ ఈ నిబంధనను ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇది ఇలాగే కొనసాగితే వంతెనకు ప్రమాదం ముంచుకువస్తుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

టెక్కలి రూరల్: మండలంలోని నర్సింగపల్లి గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. ఈ మేరకు స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. నర్సింగపల్లి గ్రామానికి చెందిన పల్ల రాములమ్మ, జె.బుద్దమ్మ అనే ఇద్దరు మహిళలు టెక్కలి వచ్చేందుకు గ్రామానికి చెందిన తోట నూకరాజు అనే వ్యక్తికి చెందిన ఆటోలో ప్రయాణమయ్యారు. ఆ ఆటో గ్రామం సమీపంలోని రోడ్డుపక్కన ఉన్న వంతెనను బలంగా ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్‌తో పాటు ఇద్దరు మహిళలకు సైతం గాయాలయ్యాయి. దీంతో వారిని తక్షణమే టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఘటనకు సంబంధించి ఆస్పత్రి సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు.

'ఆకలి తిప్పలు'కు ప్రపంచ రికార్డులో స్థానం


ఆకలి తిప్పలు నాటిక ప్రదర్శన దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో అంతర్జాతీయ గుర్తింపు పొందిన శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రపంచ తెలుగు సాహితీ కళా జాతరలో టెక్కలి ప్రజాచైతన్య కళా సమితి వారి 'ఆకలి తిప్పలు' నాటికకు ప్రపంచ రికార్డులో స్థానం లభించింది. ఈనెల 19, 20 తేదీల్లో సాంస్కృతిక అకాడమీ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఆకలి తిప్పలు నాటికకు అమేజింగ్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇంటర్నేషనల్ మార్వెల్ బుక్ ఆఫ్ రికార్డ్స్, టీఎస్ఏ బుక్ ఆఫ్ రికార్డ్స్, కల్చరల్ టాలెంట్స్ బుక్ ఆఫ్ రికార్డుల్లో నమోదైంది. దీంతో ఈ నాటిక రచయిత మూల తాతయ్య, దర్శకుడు డి.ఎ.స్టాలిన్, నటులను పలువురు అభినందించారు.

6 కిలోల గంజాయి స్వాధీనం

పాతపట్నం: అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఒడిశాకు చెందిన ముగ్గురు వ్యక్తులను పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. పాతపట్నం అంతరాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్ సమీపంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఒడిశాకు చెందిన ముగ్గురు వ్యక్తులు నడుచుకుంటూ వస్తున్నారు. అనుమానంతో వారిని తనిఖీ చేయగా 6 కేజీల గంజాయి పట్టుబడింది. దీంతో ముగ్గురిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ బి.లావణ్య తెలిపారు.

పరామర్శ


బంగారునాయుడు తల్లిని సత్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం క్రైమ్: అంతర్గత భద్రతలో శత్రువులతో వీరోచితంగా పోరాడి విధి నిర్వహణలో అమరుడైన సబ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.బంగారునాయుడు కుటుంబాన్ని శ్రీకాకుళం మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ త్రినేత్రి పరామర్శించారు. ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి ఆదేశాలతో విజయనగరం జిల్లా డెంకాడ గ్రామంలోని ఆయన స్వగృహానికి సోమవారం వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బంగారునాయుడు తల్లిని సాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. జిల్లా పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని ఆమెకు భరోసా ఇచ్చారు. సీఐ వెంట సిబ్బంది ఉన్నారు.

డీఎస్సీ ఉచిత శిక్షణ దరఖాస్తు గడువు పెంపు

శ్రీకాకుళం పాతబస్టాండ్: సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అందజేసే డీఎస్సీ ఉపాధ్యాయ పోస్టుల ఉచిత శిక్షణకు అభ్యర్థులు, శిక్షణ సంస్థలకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 25వ తేదీ వరకు గడువు పెంచినట్లు సాంఘిక సంక్షేమ శాఖ డీడీ విశ్వమోహనరెడ్డి ఒక ప్రకటనలో సోమవారం తెలిపారు. rpr@tender.apepsocurement.gov.in ద్వారా ఈనెల 25వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు.

విన్నపాలు వినవలె..!


విద్యార్థి కంటిని గాయపర్చినవారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్న బంధువులు

- మీ కోసం కార్యక్రమానికి 138 వినతులు
- నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి
- జాయింట్ కలెక్టర్ ఫర్మాన్‌అహ్మద్ ఖాన్


వినతులు స్వీకరిస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (మీ కోసం) కార్యక్రమానికి వినతులు వెల్లువెత్తాయి. ఈ సందర్భంగా అర్జీదారుల సమస్యలను వేగవంతంగా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ఆదేశించారు. జిల్లా రెవెన్యూ అధికారి అప్పారావు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి శ్రీధర్ రాజు, డీఆర్‌డీఏ పీడీ కిరణ్ తదితరులు పాల్గొన్నారు. వీరంతా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు.

పెండింగ్ దరఖాస్తులపై సమీక్ష

తొలుత ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తుల్లో పరిష్కారం కాకుండా పెండింగ్‌లో ఉన్నవాటిపై సంబంధిత అధికారులతో జాయింట్ కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి, పారదర్శకంగా విచారణ చేసి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. ప్రతీ అర్జీని సంబంధిత అధికారులు వ్యక్తిగతంగా పరిశీలించి ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని తెలిపారు. ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, రెవెన్యూ, పౌర సరఫరాల సేవలు, పేదలందరికీ ఇళ్లు పథకం కింద పట్టాల పంపిణీ, ఇళ్ల మంజూరు, పెన్షన్లు, సర్వే, ఉపాధి అవకాశాలు, భూ వివాదాలు తదితరాలకు సంబంధించి 138 అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి జాయింట్ కలెక్టర్‌కు అర్జీలు సమర్పించారు. కార్యక్రమంలో డీపీవో కె.భారతీసౌజన్య, జిల్లా వైద్యారోగ్య అధికారి డా.బి.మీనాక్షి, జిల్లా ఉద్యాన అధికారి ఆర్.వి ప్రసాదరావు, బీసీ కార్పొరేషన్ ఈడీ గెడ్డెమ్మ, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శాంతి శ్రీ, డ్వామా పీడీ బి.సుధాకర్ రావు, డీసీహెచ్ఎస్ డా.కల్యాణబాబు తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

రణస్థలం మండలం పైడి భీమవరంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి అరుణ్ కుమార్ కంటిని గాయపర్చిన తెలుగు ఉపాధ్యాయిని, అక్కడ పనిచేస్తున్న హెచ్ఎంపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి తల్లిదండ్రులు, బంధువులు ఫిర్యాదు చేశారు.

సీటు కావాలని..

నగరంలోని సిద్ధార్థ పారా మెడికల్ కళాశాలల్లో డీఎల్‌ఎల్‌టీ చదువుతున్న విద్యార్థులకు బీసీ సంక్షేమ బాలిక వసతి గృహంలో సీట్లు ఇప్పించాలని కోరుతూ 20 మంది విద్యార్థినులు వినతి అందజేశారు.

బిల్లులు చెల్లించాలని..

ఎచ్చెర్లలోని ట్రిపుల్ ఐటీలో ఆఫీస్ కార్యాలయాల వర్కులు చేశానని, అయితే వర్కులకు సంబంధించి పెండింగ్ బిల్లులు చెల్లించాలని లాసా విశ్వనాథం కోరారు. ఎన్నికల ఫలితాల అనంతరం ఏడుసార్లు మీకోసంలో ఫిర్యాదు చేసినా చర్యలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు, ఇంజినీర్లు బిల్లులు చెల్లించడంలో జాప్యం చేస్తున్నారని వాపోయారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కు 40 వినతులు


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ శ్రీనివాసరావు

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన మీ కోసం పరిష్కార వేదిక (ఎస్పీ గ్రీవెన్స్)కు 40 వినతులు అందాయని అదనపు ఎస్పీ (క్రైమ్) పాత్రిని శ్రీనివాసరావు పేర్కొన్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారులతో అదనపు ఎస్పీ ముఖాముఖి మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. 40 వినతుల్లో ఐదు అదృశ్య కేసులుండడం గమనార్హం.

నీటి సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల

శ్రీకాకుళం పాతబస్టాండ్: సాగునీటి సంఘాల ఎన్నికలకు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం సాయంత్రం నోటిఫికేషన్ విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 344 సాగునీటి సంఘాలను గుర్తించారు. ఇప్పటికే ఆయా మేజర్, మీడియం, మైనర్ ఇరిగేషన్ సంఘాల పరిధిలో ఓటరు జాబితా రూపకల్పనకు అధికారులు చర్యలు చేపట్టారు. గతంలో నిర్ధారించిన ఆయకట్టు కింద ఉన్న సర్వే నంబర్ల వారీగా జాబితా నవీకరించాలని సూచించారు. నీటిపారుదల శాఖ అధికారులు వాస్తవ ఆయకట్టు దారుడెవరనే వివరాలను క్షేత్రస్థాయి రెవెన్యూ యంత్రాంగం సహాయంతో సేకరిస్తున్నారు.

చేర్పులు, మార్పులు, అన్ని అభ్యంతరాలను పరిశీలించిన తర్వాత తుది ఎన్నికల ఓటరు (రైతులు) జాబితాను వచ్చేనెల 13వ తేదీన ప్రచురిస్తారు. నవంబర్ 21 నుంచి 27 వరకు జరగనున్న ఈ ఎన్నికలకు సంబంధించి 344 సంఘాలకు పూర్తిస్థాయి సమాచారం అందజేస్తున్నారు. సోమవారం నుంచి 40 రోజులపాటు ఈ సాగునీటి ఎన్నికల ప్రక్రియ కొనసాగనుంది. చివరగా 2015లో ఈ సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు.

నగదు అందజేత


కోవిడ్ అనాథలకు నగదు అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: కోవిడ్ ప్రభావంతో తల్లిదండ్రులను కోల్పోయి అనాథలైన బాలలకు సోమవారం శ్రీకాకుళంలోని ప్రధాన తపాలా కార్యాలయంలో పలువురు అధికారుల సమక్షంలో నగదు అందజేశారు. కోవిడ్ వలన అనాథలైన పిల్లలను ఆదుకోవడానికి 2021 సంవత్సరంలో పీఎం కేర్ ఫర్ చిల్డ్రన్ పథకం ప్రవేశపెట్టడం జరిగింది. ఈ పథకం కింద జిల్లాలో 9 మంది కోవిడ్ అనాథ బాలలకు ఒక్కొక్కరికీ రూ.10 లక్షలు చొప్పున మంజూరు చేసి, శ్రీకాకుళంలోని ప్రధాన తపాలా కార్యాలయంలో జిల్లా కలెక్టర్ గార్డియన్‌గా పిల్లలతో జాయింట్ అకౌంట్ చేసి డిపాజిట్ చేయడం జరిగింది. పిల్లలకు 18 సంవత్సరాలు వయస్సు నిండిన తర్వాత సింగిల్ అకౌంట్‌గా మార్చి, ప్రతినెలా స్టైఫండ్ రూ.5,500లు ఖాతాలో జమ చేశారు. అయితే ఇప్పటివరకు జమ అయిన సదరు మొత్తం చింతపల్లి మూర్తి రూ.1.68 లక్షలు, చింతపల్లి గీతకు రూ.1.32 లక్షలు వారి సొంతిల్లు నిర్మించుకోవడానికి విత్ డ్రా చేసుకున్నారు. మొత్తాన్ని పోస్ట్ ఆఫీస్ సూపరింటెండెంట్ వి.హరిబాబు, జిల్లా బాలల రక్షణ అధికారి కె.వి.రమణ, హెడ్ పోస్ట్ మాస్టర్ పి.రంగారావు, బాలల రక్షణ అధికారి (ఎన్ఐసీ)ఐ.లక్ష్మీనాయుడు, అసిస్టెంట్ పోస్ట్ మాస్టర్ బానోజీ రావు సమక్షంలో పిల్లలకు అందజేశారు.

మత్స్యకారులకు భారీ నష్టం


కాలి బూడిదైన వలలు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలోని డి.మత్స్యలేశం గ్రామానికి చెందిన కోడ గురుమూర్తి, కోడ కొర్లయ్యకి సంబంధించిన చేపల వేట చేసే వలలు సోమవారం రాత్రి అగ్ని ప్రమాదానికి గురయ్యాయి. సముద్రపు ఒడ్డున గుడిసెలో ఉండే భారీ వలలు కాలి బూడిదయ్యాయి. వీటి విలువ సుమారు రూ.20 లక్షలు ఉంటాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమను ప్రభుత్వమే ఆదుకోవాలని కోరుతున్నారు. ప్రమాదానికి గల కారణం తెలియలేదు.

పాఠ్యపుస్తకాల తయారీకి సిక్కోలు ఉపాధ్యాయుడు ఎంపిక

శ్రీకాకుళం / రణస్థలం : కేంద్రం ప్రవేశపెట్టిన నూతన జాతీయ విద్యావిధానం అమలులో భాగంగా ఈ నెల 22 నుంచి 24 వరకు మైసూర్‌లో జరగనున్న ఎన్‌సీఈఆర్‌టీ నూతన పాఠ్య పుస్తకాల తయారీకి రణస్థలం మండలం కొచ్చెర్ల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు బి.రాజేశ్వరరావు ఎంపికయ్యారు. ఈయన రాష్ట్ర ప్రభుత్వ పుస్తక తయారీలో, యునెస్కో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో ప్రాథమిక విద్యా బోధన విధానాలపై కూడా పాల్గొన్నారు. ఈయనకు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.తిరుమల చైతన్య, ఉప విద్యాశాఖాధికారి ఆర్.విజయకుమారి, రణస్థలం ఎంఈఓలు ఎ.త్రినాథరావు, బి.లావణ్య పలువురు ఉపాధ్యాయ సంఘ నాయకులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

డిప్యూటీ ఈఈగా వేంకటేశ్వరరావు


వేంకటేశ్వరరావు

అరసవల్లి: తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్) శ్రీకాకుళం డిప్యూటీ ఇంజినీర్‌గా చల్లా వేంకటేశ్వరరావును నియమిస్తూ టీఎండీ పృథ్వీతేజ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు డిప్యూటీ ఈఈగా పనిచేసిన బి.రాంబాబును ఎస్‌బీఎం డిప్యూటీ ఇంజినీర్‌గా స్థానికంగానే బదిలీ చేశారు.

ఇంటి స్థలం కబ్జా చేశారని ఫిర్యాదు


తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన బాధితులు

టెక్కలి: గత ప్రభుత్వంలో తమకు జగనన్న కాలనీలో ఇచ్చిన ఇంటి స్థలాన్ని కొంతమంది వ్యక్తులు కబ్జా చేశారంటూ టెక్కలి గొడగలవీధికి చెందిన పెద్దింటి లక్ష్మితో పాటు కుటుంబ సభ్యులు సోమవారం రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఎటువంటి ఇల్లు, స్థలం లేని తమకు గత ప్రభుత్వం జగతిమెట్ట సమీపంలో శ్యామసుందరాపురం లేఅవుట్‌లోని జగనన్న కాలనీలో ఇంటి స్థలం కేటాయించి పట్టా సైతం తమకు అందజేశారని పేర్కొన్నారు. అయితే ఇటీవల ఆయా స్థలాన్ని కొంత మంది వ్యక్తులు కబ్జా చేసి తమపై దౌర్జన్యం చేస్తున్నారంటూ బాధితులు వాపోయారు. రెవెన్యూ అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

న్యాయం కోసం పోరాటం


ర్యాలీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి, గిరిజన సంఘాల నాయకులు

సీతంపేట: పాతపట్నం ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల ఏడో తరగతి విద్యార్థిని సవర లావణ్య ఆత్మహత్య ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేయాలని, విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ సీతంపేటలో గిరిజన సంఘాల ఆధ్వర్యంలో సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. దీనికి పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి మద్దతు తెలిపారు. దోనుబాయి కూడలి నుంచి పార్కు చివరి వరకు సాగిన ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళావతి మాట్లాడుతూ అమాయక గిరిజన బాలిక ఆత్మహత్య చేసుకుంటే ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్న సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఏకలవ్య పాఠశాలల్లో చదువుతున్న బాలికలకు రక్షణ కరువైందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పాఠశాలల్లో పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన ఉపాధ్యాయుల బోధన భాష అర్థంకాక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిని తక్షణమే సరిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ఆదినారాయణ, నాయకులు రామారావు, చిరంజీవులు, మోహన్‌పాల్, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

దొంగ దొరికాడు


రికవరీ చేసిన బంగారు పుస్తెల తాడు

మెళియాపుట్టి: మండంలోని సంత లక్ష్మీపురం గ్రామ పంచాయతీ టకోయి గ్రామానికి చెందిన పల్లి కనకమ్మ అనే 65 ఏళ్ల వృద్ధురాలు ఇంట్లో వంట చేస్తుండగా, ఇంట్లోకి దుండగుడు చొరబడి మెడలోని 3.5 తులాల పుస్తెల తాడు అపహరించుకుపోయిన ఘటన శుక్రవారం రాత్రి జరిగిన విషయం తెలిసిందే. దీనిపై విచారణ చేసిన పోలీసులు ఒడిశా సరిహద్దుల్లోని గొప్పిలి గ్రామం వద్ద సోమవారం పుస్తెలతాడు దొంగిలించిన వ్యక్తిని పట్టుకున్నట్లు ఇన్‌చార్జి (పాతపట్నం) ఎస్ఐ లావణ్య తెలిపారు. పోలీసుల దర్యాప్తు ప్రక్రియలో అదే గ్రామానికి చెందిన శంకు లోకేశ్వరరావు(ప్రసాద్) అనే వ్యక్తి ఈ చోరీకి పాల్పడినట్లు తెలుసుకుని పట్టుకున్నారు. బంగారు పుస్తెల తాడు బాధితురాలికి అందజేశారు. నిందితుడిని అరెస్ట్ చేసి నరసన్నపేట కోర్టులో హాజరుపరిచిన అనంతరం రిమాండ్‌కు తరలించారు. పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సిరిమాను చెట్లకు పూజలు


తలపై ముర్రాట్లతో పాల్గొన్న మహిళలు

శ్రీకాకుళం కల్చరల్: పాత శ్రీకాకుళం సిరిమాను ఉత్సవాల నేపథ్యంలో పెద్దమ్మ తల్లి, నూకాలమ్మ తల్లి సిరిమాను చెట్లకు ప్రజానీకం సోమవారం పూజలు నిర్వహించారు. ముందుగా దేశెల్లవీధి నుంచి భక్తులు ముర్రాటలతో బయల్దేరగా నక్కవీధి, గొడారివీధి, దండివీధి, చాకలి వీధి, మావూరువీధి, హరిజనవీధి, బాదుర్లపేట, కొత్తపేట, కునుకుపేటల నుంచి ముత్తైదువులు ముర్రాటలతో విచ్చేసి ఖాజీపేట పంపు హౌస్ వద్దనున్న రెండు చింతచెట్లకు, కొత్తపేట వద్ద ఒక వేపచెట్టుకు ముర్రాటలతో శుద్ధిచేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దమ్మళ్లు దండకం పాడారు.

మే, జూన్‌లో ఉత్సవాలు

ఈ సిరిమాను ఉత్సవాలు 2025 మే, జూన్ మాసాల్లో జరుగుతాయని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు డీపీ దేవ్ తెలిపారు. 10 ఏళ్లకు ఒకసారి జరిగే ఉత్సవాలు గతంలో 2015లో జరిగాయన్నారు. పాత శ్రీకాకుళం ప్రాంతానికి ఇది ఎంతో ప్రతిష్టాత్మకమైన పండుగని తెలిపారు. పెద్దల నుంచి వచ్చిన ఆచారం మేరకు 1985, 1995, 2005, 2015లలో సిరిమాను సంబరాలు జరిగాయని, ఈసారి 2025 మే, జూన్ నెలలో 36 రోజుల పాటు పూజలు జరుగుతాయని తెలిపారు.

జూన్ 10న సిరిమాను ఉత్సవం

జూన్ 10న సిరిమాను ఉత్సవం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఎక్కడైనా ఒక సిరిమానుతో మాత్రమే ఉత్సవాలు జరుగుతాయని, కానీ దీనికి భిన్నంగా ఇక్కడ రెండు సిరిమానులతో ఉత్సవం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు మావూరి శేఖర్, నక్క శంకరరావు, కల్లేపల్లి సోంబాబు, గుత్తు చిన్నారావు, గుంటముక్కల చిన్నారావు, దండి రాజేంద్రదేవ్, దేశెళ్ల గోవింద మల్లిబాబు, మిండ్రాన రమేష్, దండి శ్రీనివాస పద్మజ కుమార్ దేవ్, అదపాక రాంబాబు, నందికేశ్వరరావు, రామలింగస్వామి, దండి శ్రీను, దండి జలజాక్షదేవ్, గెంజి తాతారావు, గణేష్, కోటి, కోల మణి, గెంజి ఆదినారాయణ, ముంగి జయ, పేట పద్మ తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

ఎచ్చెర్ల క్యాంపస్: కేశవరావుపేట పంచాయతీ లక్ష్మిడిపేట సమీపంలో సోమవారం సాయంత్రం పేకాట శిబిరంపై ఎస్ఐ వి.సందీప్‌కుమార్‌తో కూడిన సిబ్బంది దాడి చేశారు. ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. రూ.52,000 నగదు, రెండు బైక్‌లు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పేకాట శిబిరాలు, ఇతర అసాంఘిక కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు.

ఫీజులు తగ్గించాలని విద్యార్థుల ఆందోళన



ఫీజులు తగ్గించాలని టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు

టెక్కలి: తమకు ఎంతో భారంగా ఉన్న ఫీజులను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేస్తూ సోమవారం టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఆందోళనకు దిగారు. డిగ్రీకి సంబంధించి బీఏ, బీకాం, బీఎస్సీ తదితర గ్రూపులకు చెందిన విద్యార్థులకు ఫీజుల భారం అధికంగా ఉందంటూ వాపోయారు. పూర్తి స్థాయిలో జేవీడీ డబ్బులు వచ్చినంత వరకు ఎలాంటి ఫీజులు వసూలు చేయకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

కేజీబీవీ విద్యార్థినులు అదృశ్యం

- ప్రహరీ దూకి వెళ్లిపోయిన ఇద్దరు ఇంటర్ విద్యార్థినులు
- సీసీ ఫుటేజీ ద్వారా గుర్తింపు
- బాలికల ఆచూకీ కోసం గాలిస్తున్న పోలీసులు


వివరాలను సేకరిస్తున్న ఎస్ఐ

జి.సిగడాం: స్థానిక కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలో ఇంటర్ చదువుతున్న ఇద్దరు విద్యార్థినులు ప్రహరీ దూకి వెళ్లిపోయారు. దీనిపై ప్రిన్సిపాల్ ఐ.ప్రమీల పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..

కేజీబీవీలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న రెడ్డి భార్గవి, తలారి నిఖిత ఇద్దరూ కలిసి సోమవారం తెల్లవారుజామున 2.44 గంటలకు విద్యాలయం ప్రహరీ దూకి బయటకు వెళ్లిపోయారు. ఉదయం ఏడు గంటల సమయంలో టిఫిన్ కోసం హాజరు వేస్తుండగా వీరిద్దరూ లేకపోవడంతో సిబ్బంది ఆరా తీశారు. ఎక్కడా కనిపించకపోవడంతో సీసీ ఫుటేజీ పరిశీలించారు. అందులో ఇద్దరూ ప్రహరీ దూకి వెళ్లిపోయినట్లు ఉండడంతో ఉదయం 11 గంటలకు విద్యార్థినుల తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. అయితే వారు కూడా పిల్లలు తమ ఇంటికి రాలేదని చెప్పారు. పిల్లలు ఎటు వెళ్లారో తెలీక వారు ఆందోళన పడుతున్నారు.


బాలికలు రాత్రి సమయంలో గోడ దూకిన ప్రదేశాలను పరిశీలిస్తున్న దృశ్యం

ఎందుకంత గోప్యం..?

విద్యాలయం నుంచి ఉదయం ఇద్దరు బాలికలు అదృశ్యమైనా సాయంత్రం వరకు ఆ విషయాన్ని గోప్యంగా ఉంచారు. ఈ విషయంపై జీసీడీఓ సింహాద్రి నీరజకు సమాచారం ఇచ్చారు తప్ప మీడియాకు గానీ, మండలాధికారులకు గానీ చెప్పలేదు. విద్యార్థినుల తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చిన తర్వాత వారు విద్యాలయానికి చేరుకుని సిబ్బందిని నిలదీశారు. మీరు ఏకష్టం పెట్టకపోతే.. వాళ్లు ఎందుకు వెళ్లిపోతారు అంటూ ప్రశ్నించారు. ప్రిన్సిపాల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో స్థానిక ఎస్ఐ మధుసూదనరావు, సిబ్బందితో విద్యాలయానికి చేరుకుని ఆరా తీస్తున్నారు. సీసీ ఫుటేజీ స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.